మొదటి నుంచీ మార్కుల్లో తరగతిలో ముందుండే విద్యార్థి కాదు. పుస్తకాల పురుగు అంతకన్నా కాదు. జీవితమంటే ఎత్తు పల్లాలు సహజమనే సత్యాన్ని గ్రహించాడు. మొదటి ఇంటర్వ్యూలో విఫలమైనా అధైర్యపడలేదు. ఆత్మ విశ్వాసంతో ముందుకెళితే విజయం సాధ్యమని మాత్రం గట్టిగా నమ్మాడు ఆదిత్య సింగ్. అందుకే వరంగల్ ఎన్ఐటీ ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో అత్యధిక వార్షిక వేతనంతో ఉద్యోగం సొంతం చేసుకున్నాడు!

మార్కులను బట్టి ఉండదు.. మన విజయం!

ప్రాంగణ ఎంపికల్లో అత్యధిక వేతనం సాధించిన ఆదిత్య

బీటెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆదిత్య బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ. 88 లక్షల వార్షిక ప్యాకేజీతో కొలువుకు ఎంపికయ్యాడు. మిగతా అందరినీ వెనక్కి నెట్టి ఈ ఆకర్షణీయ వేతనం అందుకునేందుకు ఇతడికి ఉపకరించిన అంశాలేంటి? ముఖాముఖి జరిగిన తీరు? ఈ విశేషాలు అతడి మాటల్లోనే...

ఈసారి వరంగల్ నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో నాకే అత్యధిక ప్యాకేజీ వచ్చిందంటే ఆశ్చర్యంగా అనిపించింది. అయితే నేను మొదటి నుంచీ ఎప్పుడూ ఒత్తిడితో చదవలేదు. మా స్వస్థలం ఢిల్లీ. బాగా చదవాలనీ, ఫలానా ఉద్యోగం చేయాలనీ అమ్మా నాన్నా ఎప్పుడూ చెప్పలేదు. నా ఇష్టం మేరకే బీటెక్ కంప్యూటర్ సైన్స్ ఎంచుకున్నా.

మొదటి సంవత్సరం నుంచే కోడింగ్‌పై పట్టు సాధిస్తూ వస్తున్నా. బహుశా నేను మేటిగా నిలవడానికి కోడింగ్ ఉపకరించిందని భావిస్తున్నా.

అయినా నేను మొదటి ఇంటర్వ్యూలో ఎంపిక కాలేదు. మొదట ఒక కంపెనీ ముఖాముఖికి వెళ్లగా వాళ్లు తిరస్కరించారు. వారిచ్చిన సమయానికి ప్రాబ్లమ్ సాల్వ్ చేయలేకపోవడం వల్లే నన్ను ఎంపిక చేయలేదనుకుంటా.

మరో కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలోనూ నేను ఎంపిక కాలేదు. అయినా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఒకటి రెండు వైఫల్యాలు ఎదురు కాగానే నిరాశ పడిపోతే ఏమీ సాధించలేం.

రెండు సార్లు ఎదుర్కొన్న మౌఖిక పరీక్షలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుని కోడింగ్‌తోపాటు, ఇతర అంశాలనూ సాధన చేశా.

అలా మూడో ఇంటర్వ్యూలో అత్యధిక ప్యాకేజీకి ఎంపికయ్యా.

బ్లాక్ చెయిన్, మెషిన్ లెర్నింగ్ ప్రాజెక్టులు

మొత్తం 3 రౌండ్ల ఇంటర్వ్యూ జరిగింది. తొలిరౌండ్‌లో డేటా బేస్డ్ అంశాలు, రెండో రౌండ్లో సాంకేతిక అంశాలు (టెక్నికల్) పరీక్షించారు. మూడో రౌండ్లో మానవ వనరులు, మేనేజ్‌మెంట్ అంశాలను అడిగారు.

చదువుల్లో మనం సాధించిన మార్కుల కన్నా సమస్య పరిష్కారంలో ఎంత తెలివిగా ఆలోచిస్తున్నామో, వేగంగా.. సులువుగా చేశామా లేదా అనేవి కంపెనీలు చూస్తాయి.

బీటెక్‌లో బ్లాక్ చెయిన్, మెషిన్ లెర్నింగ్ సాంకేతికతలపై చాలా ప్రాజెక్టులు చేశాను. వాటిల్లో ఒకటి.. తరగతి గదిలో ఒక్క ఫొటో తీసి విద్యార్థుల హాజరు నమోదయ్యేది. హాజరు తీసుకునే క్రమంలో పేరుపేరునా పిలవడం కన్నా చిటికెలో పూర్తి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసం

నేను విద్యార్థులకు ఇచ్చే సూచన ఒక్కటే. కేవలం పుస్తకాల పురుగులా ఉండకూడదు. మన ఎదుగుదలకు అనేక అంశాలు దోహదపడతాయి. ఒక్కో వ్యక్తికి ఒక్కో రకమైన అవగాహన ఉంటుంది. ఉదాహరణకు మా సోదరుడు విక్రమ్ సింగ్ నేనూ కవలలం. అతను అలహాబాద్ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ చేస్తున్నాడు. రూ. 70 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యాడు. అలాగని మా సోదరుడికన్నా చదువుల్లో నేను ఎక్కువేం కాదు. పదో తరగతిలో 75 శాతం మార్కులు, ఇంటర్లో 95 శాతం మార్కులు సాధించా. కానీ మన విజయం మార్కులపై ఆధారపడి ఉందనుకోవడం పొరపాటు. క్రికెట్, బ్యాడ్మింటన్ లాంటి క్రీడలు ఆడతాను. కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసం ఉంటే తప్పకుండా ఉన్నత శిఖరాలు అందుకోగలం అనేది నా సిద్ధాంతం.

– గుండు పాండురంగశర్మ, ఈనాడు, వరంగల్

మెరుగైన ర్యాంకుకు మెలకువలు

ఎంసెట్/ ఈఏపీ సెట్

ఇంటర్ వార్షిక పరీక్షలు పూర్తిచేసుకున్న విద్యార్థులు.. వృత్తివిద్యాకోర్సుల్లో చేరడానికి విభిన్న ప్రవేశ పరీక్షలకు తయారవుతుంటారు. వీటిలో కీలకమైనది- ఇంజినీరింగ్, అగ్రికల్చర్, బయోటెక్నాలజీ లాంటి కోర్సుల్లో చేరేందుకు రాసే ఎంసెట్/ఈఏపీసెట్! రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు పరీక్ష ముందూ, పరీక్ష సమయంలో పాటించదగ్గ సూచనలు.. ఇవిగో!

ఎంసెట్/ ఈఏపీసెట్‌లో తెచ్చుకునే మెరుగైన ర్యాంకు ఆధారంగానే విద్యార్థి కళాశాలనూ, బ్రాంచినీ ఎంచుకునే అవకాశం ఉంది. గుర్తుంచుకోండి.. కనీసం సగం ప్రశ్నలకు సమాధానాలను సరిగ్గా గుర్తించగలిగితే.. అంటే 50 శాతం మార్కులు సాధించగలిగినా మంచి కళాశాలల్లో సీటు వస్తుంది.

తెలంగాణలో మే 10 నుంచి 14 వరకూ, ఆంధ్రప్రదేశ్‌లో మే 15 నుంచి 23 వరకూ ఎంసెట్/ఈఏపీ సెట్ నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రానికి కనీసం గంట ముందుగా చేరుకునేట్లు చూసుకోవాలి. హాల్‌టికెట్‌తో పాటు ఇచ్చే సూచనలు గమనించి పాటించాలి.

పూర్తిగా రివిజన్‌కే

- ఈ చివరి వారాన్ని పూర్తిగా రివిజన్ (పునశ్చరణ)కు మాత్రమే కేటాయించాలి. వాటిలో చాలా ముఖ్యమైన టాపిక్‌లను ముందుగా రివైజ్ చేయాలి.
- రోజంతా ఒకే సబ్జెక్టుకు కేటాయించకుండా అన్ని సబ్జెక్టులకు రోజులో కొంత సమయాన్ని కేటాయించి చదువుకోవాలి.
- ఇప్పుడు అందుబాటులో ఉన్న అతి స్వల్ప సమయంలో విద్యార్థులు కొత్త పాఠ్యాంశాలపై దృష్టి సారించకూడదు. తమకు తెలిసిన పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకోవడం ఉత్తమం.
- ఫార్ములాలు, స్టాండర్డ్ రిజల్ట్స్, మెమరీ బేస్డ్ కాన్సెప్టులను పునశ్చరణ చేసుకోవాలి.
- పాత ప్రశ్నపత్రాల సాధన ద్వారా రాసే వేగం పెంచుకోవచ్చు.
- వేగం, కచ్చితత్వం పెరిగేందుకు ఎక్కువగా గ్రాండ్ టెస్టులు రాయడం అవసరం.
- తెలుగు అకాడమీ పాఠ్య పుస్తకాల్లోని ఉదాహరణలు, అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు తప్పక చూసుకోవాలి.
- మెయిన్స్, నీట్ లాంటి పరీక్షల ఒరవడికి అలవాటుపడిన విద్యార్థులు ఎంసెట్‌లో 160 ప్రశ్నలు సంపూర్ణంగా చదివేందుకు కూడా ఇబ్బంది పడతారు. కాబట్టి ఓపిగ్గా, త్వరగా ప్రశ్నలను చదవడం, జవాబులను సాధించడం చేయాలి.
- రుణాత్మక మార్కుల్లేని కారణంగా ప్రతి ప్రశ్నకూ సమాధానం గుర్తించడం తప్పనిసరి.
- తాను చేయగలిగిన ప్రశ్నలను ముందుగా సాధించి.. ఆపైన వదిలేసిన ప్రశ్నలను రాసేట్లుగా చూసుకోవాలి.
- నేర్చుకున్న ప్రశ్నలను అనవసరమైన ఒత్తిడికి గురికాకుండా సాధించాలి.
- రాని ప్రశ్నల దగ్గర ఎక్కువ సమయం వెచ్చించకుండా, వచ్చిన ప్రశ్నను త్వరగా రాసుకోవాలి.
- పరీక్షలో చివరి 10 నిమిషాలు అన్ని ప్రశ్నలకూ జవాబు గుర్తించారో లేదో చూసుకుని వదిలివేసిన ప్రశ్నలకు విచక్షణతో జవాబులను గుర్తించాలి.

ఆసక్తి ఉన్న సబ్జెక్టుతో..

పరీక్షను ఆసక్తి ఉన్న సబ్జెక్టుతో మొదలు పెట్టాలి. ప్రశ్న తీరు కఠినంగా అనిపిస్తే వేరే సబ్జెక్టును లేదా వేరే ప్రశ్నను ఎంచుకుని సమాధానాలను గుర్తించడం ఉత్తమం. ఏదైనా ప్రశ్న అర నిమిషంలో అవగాహన కాని పక్షంలో ఎక్కువ సమయాన్ని వృథా చేయకూడదు.

విద్యార్థులు 180 నిమిషాల వ్యవధిలో 160 ప్రశ్నలను సాధించాలి. ఈమధ్య కాలంలో గణితంలో ప్రశ్నలు ఒకింత నిడివి ఎక్కువగా ఉంటున్న కారణంగా జవాబులు ప్రశ్నలతోపాటు కనిపించకపోవచ్చు. అందువల్ల విద్యార్థులు తికమక పడే అవకాశం ఉంది. అలాంటి ప్రశ్నలను జాగ్రత్తగా చదివి గుర్తుపెట్టుకోవాలి. ప్రశ్నలను పూర్తిగా చదివి జవాబు గుర్తించాలి.

గణిత శాస్త్రం



ఫార్ములాల పునశ్చరణ దీనిలో ముఖ్యం. భౌతిక, రసాయనశాస్త్రాల్లో కలిసి ఉన్న మార్కులు కేవలం ఒక్క గణితంలో ఉంటాయి. గణితంలో 80 ప్రశ్నలను దాదాపు గంటన్నరలో రాయాలి. ప్రశ్నని పూర్తిగా చదవడం, రాని, అర్థంకాని ప్రశ్నలపై మరీ ఎక్కువ సమయం కేటాయించకుండా తర్వాతి ప్రశ్నలకు వెళ్లడం ప్రధానం. ఒకసారి తెలిసిన ప్రశ్నలను పూర్తిగా సాధించాక.. వదిలేసిన ప్రశ్నల సమాధానాలను గుర్తించాలి.

గణితంలో పరీక్షకు ముందు మాత్రికలు, నిర్ధారకాలు, సరళరేఖలు, త్రిభుజ ధర్మాలు, గణితానుగమనం, సదిశా బీజగణితం, త్రికోణమితీయ సమీకరణాలు, ప్రస్తారాలు సంయోగాలు, సంభావ్యత, వృత్తాలు, సమాకలనం, అవకలన సమీకరణలు పునశ్చరణ చేసుకోవాలి.

వృక్ష శాస్త్రం

వృక్షశాస్త్రంలో జీవసాంకేతికశాస్త్రం, అనువర్తనాలు, ఖనిజపోషకాలు, ఎంజైమ్‌లు, వృక్షరాజ్యం, జీవశాస్త్ర వర్గీకరణ, వృక్ష ఆవరణశాస్త్రం, కణజీవశాస్త్రం, సూక్ష్మజీవశాస్త్రం, మొక్కల్లో ప్రత్యుత్పత్తి ముఖ్యమైనవి. ఈ పాఠ్యాంశాలను ఈ స్వల్పకాలంలో మరోసారి రివైజ్ చేసుకోండి.

జంతు శాస్త్రం

మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, ఆరోగ్యం, జంతు వైవిధ్యం 1, 2, గమనం, ప్రత్యుత్పత్తి, మానవ సంక్షేమంలో జీవశాస్త్రం చాలా ముఖ్యమైనవి. ఈ పాఠాలను పునశ్చరణ చేసుకుంటూ మాక్ టెస్టులు రాయాలి.

భౌతిక శాస్త్రం



ఫిజిక్స్ ముఖ్యంగా వివిధ సూత్రాలు, యూనిట్లు, సిద్ధాంతాల చుట్టూ తిరుగుతుంది. సిలబస్‌లో 70 శాతం మొదటి సంవత్సరం, 100 శాతం ద్వితీయ సంవత్సర పాఠాలపై ప్రశ్నలు ఉంటాయి. ప్రమాణాలు- మితులు, శుద్ధ గతికశాస్త్రం, గతి శాస్త్రం, గురుత్వాకర్షణ, స్థితిస్థాపకత, అణునిర్మాణశాస్త్రం, ఉష్ణగతిక శాస్త్రం, విద్యుత్తు పాఠాలను తుది ప్రిపరేషన్‌లో ముఖ్యమైనవిగా భావించి రివైజ్ చేసుకోండి. పాత ప్రశ్నపత్రాలను సాధన చేయడం వల్ల పేపర్ ఏ స్థాయిలో వస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఎంసెట్‌లో ఫిజిక్స్‌కి 40 ప్రశ్నలు/ 40 మార్కులకు ఉంటాయి. అందులో దాదాపు 20 ప్రశ్నలు కాన్సెప్ట్, ఫార్ములాలపై ఆధారపడి ఉంటాయి. ఇంటర్ మార్కులతో సంబంధం లేకుండా ఎంసెట్ ర్యాంక్‌ను నిర్ధారిస్తారు. కాబట్టి ప్రతి మార్కు ప్రతి ప్రశ్న చాలా ముఖ్యం. ద్వితీయ సంవత్సర ప్రశ్నలు ఈమధ్యే పూర్తిచేశారు కాబట్టి కాస్త ఎక్కువ పట్టు ఉంటుంది. ద్వితీయ సంవత్సర టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి.

రసాయన శాస్త్రం



ఇప్పుడున్న ఈ కొద్ది రోజుల సమయంలో బేసిక్స్ రివైజ్ చేసుకుంటూ ఎక్కువ వెయిటేజి ఉన్న పాఠాలు చదవాలి. ఉదాహరణకు ఆవర్తన పట్టిక, ఆమ్లాలు, క్షారాలు, పరమాణు సూత్రాలు చూసుకున్నట్లయితే దాదాపు 50 శాతం ప్రశ్నలకు సమాధానాలు రాయొచ్చు. రసాయన బంధం, రసాయన గతికశాస్త్రం, ఉష్ణగతికశాస్త్రం, నేమ్డ్ రియాక్షన్స్ చూసుకుంటే 40 మార్కులకుగాను 25 మార్కులపైన సాధించవచ్చు.

అకాడమీ పుస్తకాలు చదివితే మెరుగైన సాధన సాధ్యమవుతుంది. ఆర్గానిక్ కెమిస్ట్రీ, నేమ్డ్ రియాక్షన్స్, రీఏజెంట్లు, ఇంటర్ కన్వర్షన్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పట్టికలు, గ్రాఫ్‌లు, పటాలు, మూలక ధర్మాలు, నేమ్డ్ ప్రాసెస్‌లు పునశ్చరణ చేసుకోండి.

చివరిగా...

1. పరీక్ష రాసేటప్పుడు సమయ పాలన పాటించండి. 180 నిమిషాల్లో 160 ప్రశ్నలను సాధించాలని మరిచిపోకండి.
2. సమాధానం రాయడానికి ముందు ప్రశ్నను పూర్తిగా చదవండి.
3. సులభమైన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాసి.. కఠినమైన ప్రశ్నలను చివరిలో సాధించండి.
4. జవాబు తెలియని ప్రశ్నలకు ఎలిమినేషన్ ద్వారా జవాబులు గుర్తించండి.
5. పది నిమిషాల సమయాన్ని అన్ని ప్రశ్నలకూ సమాధానాలను గుర్తించారో లేదో చూసుకోవడానికి కేటాయించండి.
6. ఎంసెట్/ ఈఏపీసెట్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉండదు. కాబట్టి ఏ ప్రశ్ననూ వదిలెయ్యకుండా జవాబులు గుర్తించండి.

– పద్మశ్రీ జాలాది, డీన్, శ్రీ చైతన్య విద్యాసంస్థలు

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్
సంస్థ: ఇన్‌స్టాహైర్
స్టైపెండ్: నెలకు రూ. 28,000
దరఖాస్తు గడువు: మే 18
అర్హతలు: యాంగ్యులర్‌జేఎస్, సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, పీహెచ్‌పీ, పైతాన్, రియాక్ట్‌జేఎస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/9ff0f9

వెబ్‌సైట్ మేనేజ్‌మెంట్
సంస్థ: గ్రోయిఫై డిజిటల్
స్టైపెండ్: నెలకు రూ. 8,000-10,000
దరఖాస్తు గడువు: మే 18
అర్హతలు: వెబ్‌సైట్ మేనేజ్‌మెంట్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/b07150

టాలెంట్ అక్విజిషన్
సంస్థ: టెకొల్యూషన్
స్టైపెండ్: నెలకు రూ. 15,000
దరఖాస్తు గడువు: మే 18
అర్హతలు: రిక్రూట్‌మెంట్ నైపుణ్యం
☛ internshala.com/i/57f751

రియాక్ట్ నేటివ్ ఇన్‌టర్న్
సంస్థ: రెప్పు కనెక్ట్
స్టైపెండ్: నెలకు రూ. 6,000
దరఖాస్తు గడువు: మే 18
అర్హతలు: ఐఓఎస్, జావా, జావాస్క్రిప్ట్, రియాక్ట్ నేటివ్, స్విఫ్ట్ నైపుణ్యాలు
☛ internshala.com/i/ba1bb1

గుంటూరులో

మార్కెటింగ్
సంస్థ: శ్రీ షిరిడీ సాయి సేవా ట్రస్ట్
స్టైపెండ్: నెలకు రూ. 6,000
దరఖాస్తు గడువు: మే 8
అర్హతలు: అడోబ్ ఫొటోషాప్, డిజిటల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/3af224

విజయవాడ, లక్నోల్లో

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ. 3,000
దరఖాస్తు గడువు: మే 12
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/204450

అక్కడ మాస్టర్స్.. ఇక్కడ పీహెచ్‌డీ?

నేను యూఎస్‌లో మాస్టర్స్ చేశాను. ఇప్పుడు ఆంధ్రా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేయవచ్చా?

– ఎంవీఆర్ సుబ్బారావు

మీరు యూఎస్‌లో ఏ సబ్జెక్టులో మాస్టర్స్ చేశారో చెప్పలేదు. అలాగే మాస్టర్స్ కాలవ్యవధి ఒక సంవత్సరమో, రెండు సంవత్సరాలో కూడా చెప్పలేదు. సాధారణంగా యూఎస్‌లో రెండు సంవత్సరాల మాస్టర్స్‌లో 36 నుంచి 42 క్రెడిట్‌లుంటాయి. మన దేశంలో రెండు సంవత్సరాల పీజీ కోర్సులో 72 నుంచి 80 క్రెడిట్‌లు ఉంటాయి. మనదేశంలో ఎంటెక్ కోర్సులో అయితే 68 క్రెడిట్‌లుంటాయి. మీరు ఆంధ్రా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేయాలంటే ముందుగా యూఎస్‌లో చేసిన మాస్టర్స్ డిగ్రీ, ఇండియా మాస్టర్స్ డిగ్రీకి సమానమని ఆంధ్ర యూనివర్సిటీ వారు అంగీకరించాలి. డిల్లీలో ఉన్న అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) వారు కోర్సు కాల వ్యవధి, క్రెడిట్ల సంఖ్య, సిలబస్ లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని యూఎస్ డిగ్రీ, ఇండియన్ డిగ్రీకి సమానమని ఈక్వివలెన్స్ సర్టిఫికెట్ ఇస్తారు. ఏఐయూ వెబ్‌సైట్‌కి వెళ్ళి, మీరు చదివిన యూఎస్ యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీకి ఇండియన్ మాస్టర్స్ డిగ్రీతో సమాన హోదా ఇచ్చారేమో చూడండి. లేని పక్షంలో ఏఐయూకి మీరే దరఖాస్తు చేసుకోండి. ఇదంతా చేసే ముందు ఒకసారి ఆంధ్రా యూనివర్సిటీలో రీసెర్చ్ డీన్‌ని సంప్రదించి, మీ పీహెచ్‌డీ అవకాశాల గురించి చర్చించండి.



– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

ఉర్దూ విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రధాన క్యాంపస్‌తో పాటు అనుబంధ క్యాంపస్‌లలో 2023-24 విద్యా సంవత్సరానికి రెగ్యులర్ విధానంలో కోర్సులను అందిస్తోంది. అర్హులైన అభ్యర్థులు పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా, సర్టిఫికెట్‌లలో ప్రవేశాలు పొందవచ్చు.

ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పించే కోర్సులు

1. **పీహెచ్‌డీ:** ఉర్దూ, అరబిక్, ఇంగ్లిష్, హిందీ, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, విమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, డెక్కన్ స్టడీస్, ఎడ్యుకేషన్ తదితరాలు.
2. **పీజీ:** ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ (సీఎస్), ఎంఈడీ, బీఈడీ.
3. **యూజీ:** బీటెక్ (సీఎస్), బీటెక్ (సీఎస్) లేటరల్ ఎంట్రీ
4. **ప్రొఫెషనల్ డిప్లొమా:** డీఈఎల్ఈడీ, పాలిటెక్నిక్- డిప్లొమా, పాలిటెక్నిక్- డిప్లొమా లేటరల్ ఎంట్రీ.

మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పించే కోర్సులు

1. **పీజీ ప్రోగ్రాం (పార్ట్ టైమ్):** ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంఎడ్యుకేషనల్, పీజీ డిప్లొమా.
2. పీజీ డిప్లొమా ప్రోగ్రాం (పార్ట్ టైమ్)
3. డిప్లొమా ప్రోగ్రాం (పార్ట్ టైమ్)
4. సర్టిఫికెట్ ప్రోగ్రాం (పార్ట్ టైమ్)

అర్హత: కోర్సును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ (పీహెచ్‌డీ): 28-05-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ (ప్రవేశ పరీక్ష ఆధారిత- ప్రొఫెషనల్/ టెక్నికల్/ ఒకేషనల్ ప్రోగ్రాం): 28-05-2023.
ప్రవేశ పరీక్ష తేదీలు: 20, 21, 22-06-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ (మెరిట్ ఆధారిత పీజీ (జనరల్/ ప్రొఫెషనల్) ప్రోగ్రాం): 24-07-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ (పార్ట్-టైమ్ ప్రోగ్రాం): 30-09-2023.
వెబ్‌సైట్: https://manuucoe.in/regularadmission/

ఎన్ఐఏఎంటీ, రాంచీలో ...

ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ 2023 విద్యా సంవత్సరానికి అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
ఫౌండ్రీ టెక్నాలజీ– 58 సీట్లు; ఫోర్జ్ టెక్నాలజీ- 57 సీట్లు.
అర్హత: డిప్లొమా, బీఈ, బీటెక్ (ఆటోమొబైల్/ మెకానికల్/ మెటలర్జికల్ మాన్యుఫ్యాక్చరింగ్/ ప్రొడక్షన్/ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్) లేదా బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్).
ఎంపిక: విద్యార్హత మార్కులు, కౌన్సెలింగ్, పరీక్షలు, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-05-2023.
దరఖాస్తు హార్డ్ కాపీని పంపడానికి చివరి తేదీ: 09-06-2023.
వెబ్‌సైట్: http://www.niamt.ac.in/

ఏపీ బీసీ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

విజయవాడలోని మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించే 14 బీసీ బాలబాలికల జూనియర్ కళాశాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్‌మీడియట్ (ఇంగ్లిష్ మీడియం) ప్రవేశ ప్రకటన వెలువడింది. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు మే 18లోగా దరఖాస్తులు సమర్పించవచ్చు.
మహాత్మా జ్యోతిబా పులే ఏపీ బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2023
విద్యార్హత: విద్యార్థులు సంబంధిత జిల్లాల్లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలలో పదో తరగతి మార్చి 2023 ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షకు మించకూడదు.
వయసు: 31.08.2023 నాటికి 17 ఏళ్లు మించకూడదు.
ప్రవేశ పరీక్ష: ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఓఎంఆర్ షీట్ విధానంలో 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. మ్యాథ్స్(20 మార్కులు), ఫిజికల్ సైన్స్(20 మార్కులు), బయోసైన్స్(20 మార్కులు), సోషల్ సైన్స్(15 మార్కులు), ఇంగ్లిష్(15 మార్కులు), లాజికల్ రీజనింగ్(10 మార్కులు) సబ్జెక్టుల్లో పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు.
ఎంపిక: అర్హులైన అభ్యర్థులకు ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ (అనాథ/ మత్స్యకార) ఆధారంగా సీటు కేటాయిస్తారు.
దరఖాస్తు రుసుము: రూ. 250.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18-05-2023.
ప్రవేశ పరీక్ష తేదీ: 28-05-2023. **ఫలితాల ప్రకటన:** 10-06-2023.
వెబ్‌సైట్: https://mjpapbcwreis.apcfss.in/

ఐఐఎంలో ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ రోహ్‌తక్ 2023-25 విద్యా సంవత్సరానికి స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో ఎగ్జిక్యూటివ్ పీజీ డిప్లొమా ప్రవేశానికి అనుభవజ్ఞులైన మేనేజ్‌మెంట్ నిపుణులు, క్రీడా ఔత్సాహికులు, స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్‌ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
అర్హత: కనీసం 50% మార్కులతో ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమానం. సంబంధిత రంగంలో అనుభవానికి ప్రాధాన్యం.
ఎంపిక: స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ. 1000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18-07-2023.
స్పోర్ట్స్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్ టెస్ట్ తేదీ: 29-07-2023.
ఇంటర్వ్యూ తేదీ: 29-07-2023. **ఫలితాల ప్రకటన:** 12-08-2023.
వెబ్‌సైట్: https://www.iimrohtak.ac.in/

ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ...

ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఏపీ మోడల్ స్కూల్ సొసైటీ... 2023-24 విద్యా సంవత్సరానికి ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి(ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
ఏపీ మోడల్ స్కూల్స్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష-2023
అర్హత: సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022-23 విద్యాసంవత్సరంలో అయిదో తరగతి చదివి ఉండాలి.
వయసు: ఓసీ, బీసీ విద్యార్థులు 01-09-2011 నుంచి 31-08-2013 మధ్య; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2009 నుంచి 31-08-2013 మధ్య జన్మించి ఉండాలి.
ఎంపిక: ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.
పరీక్ష రుసుము: ఓసీ, బీసీలకు రూ. 150; ఎస్సీ, ఎస్టీలకు రూ. 75.
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 09-05-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25-05-2023.
ప్రవేశ పరీక్ష తేదీ: 11-06-2023.
వెబ్‌సైట్: https://apms.ap.gov